

# మోళ్ళు చిగురించాయి

జి. భాను

**సూర్యుడు** అస్తమిస్తుంటే ఆకాశం నానా వర్ణ కిర్మీరితమై పోయింది! ఆ రంగులు... హాహా! కలల వంటి రంగులు! మనుష్యుల్లో ఎన్ని గుణాలో అన్ని రంగులు! సూర్యుడు అస్తమిస్తుంటే ఉదయిస్తున్న చంద్రుని లాగా, మానవుల మనస్సుల్లో దూసుకొచ్చే శృంగారం లాగా బంగారు రంగుల విచిత్ర వర్ణాలు!

ఆ సమయంలో యథాప్రకారంగా హరిహరరావు షికారుకని ఇంటి నుండి బయట పడ్డాడు. నాలుగు సంవత్సరాల నుండి తాళం వేసుకుంటున్నట్లుగా ఆ నాడూ తాళం వేశాడు. సిగరెట్ ముట్టించాడు. ఆ వీధిలో నుండి తిన్నని చూపుతో నడుస్తూ రోడ్డు మీదకు వచ్చాడు.

పల్లెకు, పట్టణానికి మధ్యస్థంగా ఉన్న ఆ పూర్ణ కుర్రకారుకు, నడికారుకు మధ్య వయస్సున్న అతను, రోడ్డుపక్కగా నడుస్తున్నాడు.

అతని సంస్కారం, సభ్యత ఇరుగు పొరుగు వాళ్ళకి తెలుసు! అతని నిర్ణీత కార్యక్రమం దారి పక్కనున్న చెట్లకు తెలుసు! అతని భావాలు అతను కూర్చునే బండరాయికి తెలుసు! అతని గుండెలోని గుబులు కొద్ది దూరంలో కనపడుతున్న ముచ్చటైన రెండు కొండలకు తెలుసు!

ఆలోచనల సాయంతో నడుస్తున్నాడు హరిహరరావు.

లేత చీకటి నల్లకోక కట్టుకున్నది! మినుక్కుమంటున్న చుక్కల కాంతి కన్ను గీటుతున్నది. వారం ప్రాయపు కుర్ర చంద్రుడు మరీ విడిసి వస్తున్నాడు మబ్బుల తెరల్లో నుండి!

అటువంటప్పుడు జన సంచారం లేని ఆ బాట మీద నెమ్మదిగా నడుస్తున్న హరిహరరావును దాటి ఒక స్త్రీ మూర్తి ముందు నడుస్తున్నది. ఆమె కొప్పులో తురుముకున్న సన్నజాజుల పరిమళం అతని మనస్సులోని మధుర స్మృతుల కొదమ నాగును జోకొట్టి లేపినట్లైంది.

మసక చీకటిలో, నిర్మానుష్య ప్రదేశంలో కాటు వేస్తున్న పూల కొప్పుతో నిర్భయంగా నడుస్తున్న నెరజాణ ఎవరీమె? ఇన్నేళ్ళలో ఇటువంటి సంఘటన సంభవించలేదే? అనుకున్నాడు హరిహరరావు.

నడక వేగం హెచ్చించాడు. ముందు నడుస్తున్న ఆమె చేరువైంది. వెనక మగ మనిషి నడుస్తున్నాడనే వైనం తెలిసే మనోరథాన్ని ఊడుస్తున్న పూల రథంలా తక్కుతూ తారుతూ, తాపీగా, సుతారంగా నడుస్తున్నదే? ఏమి టీమె అంతర్యం? ఆలోచిస్తున్నాడు హరిహరరావు.

క్రమంగా ఆమెకు దగ్గరయ్యాడు. గంగానదికి ఇద్దరి కానవస్తున్నది!

నురుగు లాగా నవ్వుతున్న సన్నజాజులు!

సుతారంగా కదులుతున్న ఇసుక తిన్నెలు!

ప్రవాహంలా కదులుతున్న ఒంటి ఒంపులు.

అతని అంతరంగంలో, రక్తపు తరంగాల్లో, నరాల తంత్రుల్లో స్త్రీ రాగం నినదిస్తున్నది!

కొన్నేళ్ళుగా మారాముళ్ళు వేస్తున్న ఒంటరితనం ఈ క్షణంలో తుంటరిదైంది. సిగరెట్ ముట్టించాడు.

గొంతు పెకలించుకున్నాడు.

"ఎవరది?"

"నేనే!"

"అంటే?"

"మనిషినే!"

"దయ్యానివని నే ననలేదే?"

"కాళ్ళు చూసుకోరాదూ!" కిలకిల నవ్వి ఆగింది. పక్కన చేరాడు రావు. ముఖంతో ముఖం పెట్టి చూశాడు. ఎన్నడూ చూడని అందమైన ముఖం కవ్వించే కాటుక కళ్ళు! వెన్నెల విరిసే పళ్ళు! ఎర్రని గాలం వంటి పెదాలు!

"కాళ్ళేనా చూసేది?" సిగరెట్ దమ్ము లాగి పారేసిన తరవాత సుకుమారంగా అడిగాడు.

"ఏం? మీరు మెట్లమీద నుంచి నడవరా?" అని నవ్వింది.

"తొందరైతే దూకుతానుకూడా."

"దూకుడుకు తట్టుకొనే సత్తా ఉండకుండా ఉంటుందా?"

"అయితే ఫరవాలేదు. దారికొచ్చావు."

"భలేవారే మీరు! దారిలోనే ఉంటే!"

"దారి తప్పిస్తే?"

"దారి దొరికినట్లే!"

"ఓహో! బాగుంది." ఇంకో సిగరెట్ ముట్టించాడు. అగ్గిపుల్ల వెలుగులో ఆమె కళ్ళు వెలుగుతున్నవి.

"ఏం పేరు?"

"ఏ పేరుతో పిలిచినా పలుకుతా."

"ఆహా రాణి అంటే?"

"ఆ. అంటా."

"మరి నీది ఏ వూరు, రాణీ!"

"ఎక్కడ చీకటడితే అదే వూరు నా రాజా!" అని అతని ముఖంలోకి చూసి నవ్వింది.

హరిహరరావుకు ఆకాశం అందినట్లనిపించింది. చుక్కల్ని తెంపుకుని గుప్పెట్లో పెట్టుకుని, చంద మామను చప్పరించాలనే తహతహ తలెత్తింది.

"రాణీ" అంటూ ఆమె భుజంపై చెయ్యి వేశాడు.

"వూఁ." అతని చేతిపై చెయ్యి వేసింది. అతని గుండెలోని కోర్కెల మొగ్గలు అమాంతం విచ్చాయి. రక్తం వాంఛాస్త్రాన్ని సంధించింది. చీకటిలోని జీవుల స్వరాలు మంగళతూర్య నాదాలైనాయి. కొండగాలి ఎగిసి పడుతున్న తమకానికి స్వాగత మిచ్చింది.

ఆమెను తన వైపు లాక్కుని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. ఆమె ముద్దు మైకంలో అతని హస్తాల్లో మైనపు బొమ్మలా హత్తుకుని పోయింది.

రోడ్డుపై నుండి పక్క దారికి మళ్ళించాడు ఆమెను.

చెట్టా పట్టాలు వేసుకుని గండ్ర ఇసుక పైన నడుస్తుంటే గుగుర్పాటు చెందిన నేలపై నడుస్తున్న అనుభూతి కలుగుతున్నది. సమస్యల జీవితాన్ని ఉద్వేగమైన మనస్సుల కింద మట్టు పెట్టి పులకలు దేరిన మగాడు, ఆడది పరస్పరం రాసుకుని సాగుతుంటే పరచిన కలల మీద నడిచినట్లుంది.

ముషిణి చెట్ల చిగురాకులపై వెన్నెల చిందు లేస్తున్నది. ఇసుకపై వెన్నెల దాగుడుమూత లాడుతున్నది.

కొండల వైపుగా నడుస్తున్న క్రొంగొత్త జంట పైన వెన్నెల ముద్దు పెట్టుకుంటుంటే, ఆ ఇద్దరూ ముద్దులు పూసే అగ్ని పర్వతా లయ్యారు.

కొంత దూరం నడిచి కొండల దగ్గర రాతిబండ పైన మాటా మంతీ లేక తమకంలో తడిసిపోయి, కాంక్షల భారంతో కుంగిపోయి ఎదురెదురుగా కూర్చున్నారు. చూపులలో మనస్సుల్ని తూచుకుంటు న్నారు. ఎన్నో తలపులున్నా మాట్లాడాలని అనిపించడం లేదు. అప్పుడు వారి దగ్గరే ఒక పక్షి వెంట మరొక పక్షి వలయాకారంగా అనుసరిస్తూ తిరుగుతున్నది. ఆ పక్షులు కువకువ మంటున్నవి. ఆ పక్షుల సరాగాన్ని చూసి హరిహరరావు ఆమె సజ్జన చేరాడు. గాఢంగా వాటేసుకున్నాడు. స్పందిస్తున్న పెదాలపై ముద్దులు ముద్రించాడు. ఆవేశంగా ఆవేగంగా ఆమె రవికను విప్పాడు. ఆమె రాతిబండపై ఒరిగిపోయింది.

ఎదురుగా స్నిగ్ధమైన, చెర విడిన జంట బంగరు కొండలు... నునువెన్నెల కాంతి మీద పడి అదో రకమైన నూత్న శోభతో కన్నుల్లో కోర్కెల్ని రేకెత్తిస్తూ... పొంకంగా, పొందికగా, కుదురు నిండిన వాటి అగ్రాలపై నల్లని కిరీటాలు..

చూస్తున్న హరిహరరావు గుండె గట్టు తెగి పోయింది.

ఆడదాని మాంసపు స్పర్శ కోసం మగవాడు ఆబగా, ఆరాటంగా ఆకాంక్షిస్తూ కయ్యానికి కాలు దువ్విన సంఘటనలు, ఆయిన వారిని తెగతెంపులు చేసుకున్న సన్నివేశాలు, ఔచిత్యాన్ని గణించని సందర్భాలు లోకంలో కోకొల్లలు!

హరిహరరావు కాము మృగమై ఆమె ఎత్తు పల్లాల మాధుర్యం చూసి శివమెత్తి పోయి, ఆమెపై ఒరగబోతున్నాడు!

అప్పుడు ఆమె కళ్ళు తెరిచి "పబ్బం గడుపు కోవడమే కానీ. ఆలోచించడం మీకూ లేదన్న మాట" అంది.

ఆ మాట ఎక్కడ పని చేసిందో కాని హరిహరరావు పొంగే పాలలో నీటిచుక్క పడినట్లుగా చప్పబడి పోయాడు. టక్కున కూర్చున్నాడు. ఆమె ముఖం లోకి చూశాడు.

"ఎవరు నువ్వు? ఆ మాట ఎందుకన్నావు?" అన్నాడు.

"నే నెవర్నో అడిగే ముందు, మీ రెవరో చెప్పరా?" అంటూ పైట లాక్కుంది.

"నా కన్న ముందు నడుస్తూ, నా కాళ్ళకు బంధాలు వేసింది నువ్వేగా? నువ్వే చెప్పు."

"ఎవరు ఎవరికి బంధాలు వేసింది అనవసరం. రెండు చేతులు కలియకుండా, రెండు మూతులు కలియకుండా చప్పుడు రాదు కదా! ఆ మాట కొస్తే మీరే నా ముందు నడిచారు. కాబట్టి ఆ మాట తీసేయండి. పోతే మీ రడిగారే—నా మాటకు అర్థం ఏమిటని? దానికి జవాబు చెప్పాలి. అంతేగా!" అంటూ కూర్చున్నది.

హరిహరరావు ఆమె ముఖం వైపు చూస్తూ సిగరెట్ ముట్టించాడు.

"ఒక ఆడది గబ్బగీము చీకటిలో ఒంటరిగా మగాడి కన్నా ముందు నడిచిందే అనుకోండి. దాని ఉద్దేశం ఏంటి? దాని మనసులో ఏమనుకుని అంత బరి తెగించింది? ఇట్లా మీరు ఆలోచించారా? అడిగారా? లేదు. తేరగా, దారిలో దొరికింది లెమ్మని అందరిలాగే మీరూ అనుభవించి పారేద్దాం అనుకున్నారు కాని, దీని కథ కనుక్కుందాం అని అనుకున్నారా?" గొంతు గాద్గదికమైంది.

హరిహరరావుకు ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంది.

ఆమె మాట్లాడింది కొంతవరకు సమంజసంగానే ఉంది. నిజానికి ఆ ఆలోచన తనలో ఎందుకు మూగ బోయిందో అనూహ్యంగా ఉంది. ముక్కూ మొహం తెలియని ఒక ఆడది అతని అవివేకాన్ని విమర్శించడం అవమానకరం అనిపించింది.

"పొరబాటై పోయింది, రాణీ! ఈ సమయం సందర్భం నా నోరు కట్టేశాయి. నువ్వన్నట్లుగా నీ సంగతి అడగటం ధర్మమే. నేను తొందర పడ్డాను. దానికి తోడు నువ్వు కూడా అడిగే అవకాశం ఇవ్వలేదు కదా!" మెత్తగా మాట్లాడుతున్నాడు పురుషుడు.

ఇంకెవరన్నా అయితే 'ఇష్టపడి వచ్చావు. ఉంటే ఉండు, లేకపోతే పో! ప్లీడర్‌లా మాట్లాడొద్దు' అని ఉండేవారు—పాపం! ఈయన ఎంత ఇదిగా మాట్లాడుతున్నాడు! అతని జుట్టులోకి చెయ్యి పోనిచ్చి, తలను గుండెకు అదుముకుని అనునయించా లని అనిపించింది. అతని వైపు ఆర్ద్రంగా చూసింది.

"ఇప్పుడేం మునిగి పోయిందీ! నువ్వెవరో నాకు తెలియదు. నా సంగతి నీకు తెలియదు. ఇందాకటి మాట నా తత్వాన్ని నువ్వు అంచనా వేసినట్లు అనుకోవలసి వస్తున్నది. ఏది ఏమైనా నీ గురించి చెప్పు—వింటాను. తరవాత సంగతి ఆలోచిద్దాం."

"చెబుతాను. విన్న తరవాత దారి చూపిస్తారో, దారి చూపించకుండా తప్పుకుంటారో మీ ఇష్టం.'

"వూఁ. కానీయ్."

"నా సంగతి చెప్పే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞురాల్ని. త్రికరణశుద్ధిగా చెబుతున్న నా గాథ విని మీరు తరణోపాయం చూపిస్తారని ఎందుకో నమ్మకం.

ముగ్గురూ ఆడపిల్లలే పుట్టడం నా తలి దండ్రుల దురదృష్టం. అయితే ఉన్నది రెండెకరాలు కావడం, మా నాన్న ఉద్యోగం అంతంత మాత్రంది అవటం మా గ్రహచారం. చేతినిండా డబ్బుంటే మా గతి ఇంకో విధంగా ఉండేదేమో! పెద్దక్క సరోజ అందంగా ఉన్నా, ఎకరం పొలం కట్నంగా తీసుకుని, ఇంకా లాంఛనాలకు కొన్ని వేలు పుచ్చుకుని వాళ్ళ మామగారు ఔదార్యం చూపించారు. ఇక మా బావగారు మా అక్కను బాగా ప్రేమించడానికి తరుచు ఇంటికి పంపుతూ ఉండేవారు. ఏదో విధంగా వాళ్ళ దాహానికి దాసోహమని మా నాన్న ఉన్నంతలో సర్ది పంపుతూ ఉండేవారు.

అట్లా మూడేళ్ళు గడిచిన తరవాత, మా అక్క

వందేళ్ళ జీవితం ఏడడుగుల లోతు నీరున్న బావిలో సమాప్తమైంది. కాలు జారి పడిందని అందరూ అనుకున్నారు. మా నోళ్ళు మూతలు పడి, గుండెలు బీటలు వారాయి.

రెండో అక్క సరళ. ఎంత మంచిదో చెప్పలేను. కావాలనే సంపన్నులుకోడలుగా చేసుకొన్నారు 'ముష్టి పదివేలు' తీసుకొని. ఒక్కడే కొడుకు వాళ్ళకి. నోట్లో నాలుక లేని బుద్ధి మంతుడు. మా అక్కను బాగా ప్రేమించేవాడు. వాళ్ళమ్మను చూసి మహా జడుసుకొనేవాడు. ఐదేళ్ళుబాగానేగడిచాయి. మాఅక్క కడుపున ఒక పిల్ల పుట్టిన తర్వాత అత్తగారి ఉగ్ర స్వరూపం బైటపడింది. పిల్లకు ముద్దూ ముచ్చటా అంటూ అవి కావాలి, ఇవి కావాలి అని సతాయించడం మొదలెట్టింది. మొదటి దెబ్బ తిన్న మా నాన్న అత్తగారి ఆశలకు హారతైపోయాడు. ఒక రోజు సరళ చావు కబురు చల్లగా వచ్చింది—కిరసనాయిల్ స్టవ్‌కాళ్ళకు తగిలి, ఆ మంట చీర అంచుకు తగిలి, ఆ ఇంట్లో వాళ్ళు చూస్తూండగానే మాడి మసైపోయిందని. మా గుండెలు పగిలిపోయాయి.

ఆ కబురు విన్న వారం రోజుల తర్వాత మా అమ్మ చచ్చిపోయింది. మా నాన్నేమో పిచ్చివాడయ్యాడు.

బిడ్డల్ని కన్నందుకు ఎంత దొడ్డ సుఖం అనుభవించారో చూశారా నా తలిదండ్రులు! డబ్బుకోసం మానవత్వాన్ని చంపుకొన్న వ్యక్తుల మూలంగా మా కుటుంబం అర్ధాంతరంగా ఆరడైపోయింది. ఆడదాన్ని ఆదుకోలేని మగరాయుళ్ళ మూలంగా నా అక్కల జీవితం ముక్కలై పోయింది. అందుకే పెళ్ళంటే విముఖత్వం, భయం! మగాళ్ళంటే మంట, ద్వేషం, కంపరం కలిగాయి. మా అమ్మమ్మ, నేను మా వూర్లో జీవచ్ఛవాల్లా అయిదారు సంవత్సరాలు వెళ్ళబుచ్చాము. జ్ఞాపకాలు వెంటాడుతుండగా ఆ ఇంట్లో, ఆ వూర్లో ఉండలేక మా బంధువులున్న ఈ వూరికి మూడు సంవత్సరాల క్రిందట వచ్చాం.

కుట్టుమిషన్‌తో బైటకు రాకుండా కాలాన్ని నెట్టుకొస్తున్నాం. ఈ మూడేళ్ళలోనే నా నిరాశా జీవితంలో వో మమతల మందిరం కనబడింది.

మా ఇంటి వెనక ఉన్న చిన్న కిటికీలోనుండి చూస్తే ఎదుట ఇంట్లోనుంచి ఒక వ్యక్తి కనబడుతుండేవాడు. తన ఉద్యోగం, ఇల్లు తప్ప వేరే దృష్టి లేని ఆ పెద్దమనిషి తరహాను పరిశీలించడం నా కొకదైనందిన కార్యక్రమం అయిపోయింది. ఆయన నిర్ణీత కార్యక్రమం నాకు క్షుణ్ణంగా తెలుసు! హోటల్ తిండి తిని, మఠంలో ఉంటున్నట్లు ఆ ఇంట్లో ఉన్న ప్రేమమూర్తిని నాకు తెలియకుండానే ఆరాధించాను, ప్రేమించాను. అటువంటి వ్యక్తి నీడలో బ్రతుకు హాయిగా ఉంటుందని నిర్ధారించుకొన్నాను ... అట్లా ..."

"అట్లా అనుకొన్నదానివి నా వెంట పడడం ఏం బాగోలేదే మరి" అన్నాడు సిగరెట్ అవతల పారేస్తూ.

"నేను చూసిన వ్యక్తి, వెంటబడిన వ్యక్తి ఒక్కరే గదా! బాగోలేక పోవడమేమిటండీ?" చిరునవ్వుతో అంది.

అదిరిపడ్డాడు హరిహరరావు. "ఏమిటి నువ్వనేది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకండీ కంగారు పడతారు? ఈ మూడేళ్ళనుంచి మిమ్మల్నే చూస్తూ ఆశా సౌధాలు కట్టుకొన్నాను. ఆఫీసునుండి రావడం, ఏదో చదువుకోవడం, మౌనంగా కూర్చోవడం, సాయంత్రాలు ఇట్లా షికారుకు వెళ్ళడం నేను గమనిస్తూనే ఉన్నా. మోడువారిన నా మనస్సు చివురించింది. మిమ్మల్ని ఎట్లా కలుసుకోవాలి? నా గురించి ఏ విధంగా వివరించాలి? అని ఎంతో కాలంగా పథకం వేసుకొన్నాను. చివరికి ఇవాళ బజారు మనిషిలా నటించాను. నా తెంపరితనాన్ని మన్నించండి. జీవితంలో బాధల బరువు మోశాను. మగాళ్ళ విపరీత ప్రవర్తన విన్నాను. గుండెను బండగా చేసుకొన్నాను. మిమ్మల్ని చూసి ఈ గుండె కరిగిపోగా మీరే ఆశ్రయం అనుకొన్నాను. మీకోసం, మీ దృష్టిలో పడడంకోసం అనుచితంగా ప్రవర్తించాను. నా ముప్పయి సంవత్సరాల జీవితంలో నేను మొట్టమొదటిసారి ఇలా ... మీరు కసిరికొట్టినా, విసిరి తిట్టినా భరిస్తాను" అని అతని కాళ్ళపై పడిపోయింది. అతనికి కాళ్ళపైన నులి వెచ్చని స్పర్శ.

హరిహరరావు విచలితుడయ్యాడు. కలలా ఉన్న ఆ సంఘటన విచిత్రంగా అనిపించింది.


"లే, రాణీ! లే ... నిజానికి నువ్వు చేసిన తప్పేముంది గనుక! నాకూ దీనిలో భాగస్వామ్యముంది. నీ సంగతి విన్న తర్వాత నీ కుటుంబం అంటే, నువ్వంటే నా కెంతో సానుభూతి, గౌరవం ఏర్పడ్డాయి. నన్నేం చేయమంటావో చెప్పు?" అని కాళ్ళమీద నుండి ఆమెను లేపాడు. అనునయంగా చూశాడు.

"చెప్పనా? నా మెడలో పసుపుతాడు కట్టండి. మీ జీవితంలో సుఖసంతోషాల్ని పండిస్తాను. నాకు దారి చూపించండి" అన్నది ఉద్వేగంగా.

"వూఁ... నా సంగతి తెలియక, నా బాహ్య పరిస్థితి గమనించి మాత్రమే ఇట్లా అడుగుతున్నావు, రాణీ ... తెలిస్తే నన్ను కోరుకోవు." సాలోచనగా అన్నాడు.

"హరిహరరావుగారూ! మీ సంగతి నాకు తెలుసు అనడానికి ఈ విధంగా సంబోధించాను. క్షమించండి. నా పేరు వాణి. మీ సంగతి నాకు పూర్తిగా తెలుసు. మీ శ్రీమతి, ఇద్దరు పిల్లలు బస్సు ప్రమాదంలో ఎనిమిది సంవత్సరాల క్రిందట మరణించిన వార్త మా అమ్మమ్మ ద్వారా విన్నాను. మీరు మౌనంగా ఉంటూ, ఒక ప్రత్యేక ప్రపంచంలో కూరుకొనిపోయి ఇక్కడకు వచ్చి ఉంటున్నారని తెలుసు. మీ అర్ధాంగికి సన్నజాజులంటే ఇష్టమని కూడా తెలుసు. అన్నీ తెలిసే ఈ విధంగా చొరవ చేసి అడుగుతున్న నా కోర్కెను మన్నించండి. మీ మాటే నా జీవితానికి మలుపు ..."

దీర్ఘ నిశ్వాసం విడిచాడు హరిహరరావు. వో క్షణం గతం గిర్రున తిరిగింది. మనసు తెరపై బొమ్మలు కదిలాయి. ప్రస్తుతం వర్తమానం ముందు నుంచున్నది.




"నా గతం తెలిసిన నీతో జీవితం పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాను, వాణీ! ఇంతకీ మీ మామ్మగారంటే నాకు పండగలకు, పబ్బాలకు పిండివంటలు తెచ్చిపెట్టే మహాతల్లి, ఎదురింటి సీతారామమ్మగారేనా ... ఆమెకు ఒక్క దానికే నా కథ చెప్పాను."

"అవునండీ! నేను, ఆ సీతరామమ్మగారు మీకు జీవితాంతం ఋణపడి ఉంటామండి ... నేను అదృష్టవంతురాలిని. ఈ సమయంలో మా అమ్మ ఉంటే, ఈ సంగతి మా నాన్న వింటే .." భోరున ఏడ్చింది వాణి.

"చా ... చా ... ఏడవ వద్దు, రాణీ! పద ... కొద్ది రోజుల్లోనే నిన్ను పెళ్ళి చేసుకొంటాను. ఇద్దరం గతాల్ని పాతిపెట్టి, క్రొత్త లోకాన్ని సృష్టించుకొందాం. అప్పటివరకు పవిత్రంగా ఉందాం" అని చెయ్యి పట్టుకొని ముందుకు నడిపించాడు.

ఇద్దరూ ఆ మూగ వెన్నెలలో ముందుకు సాగిపోయారు.

అంబర వీధిలోనుండి అరుంధతి వీక్షిస్తున్నది! *